# పని మనిషి

ఆశ్చర్యమేమిటంటే నరిసింహం, మనిషికెన్ని కష్టాలు రావచ్చునో, అన్ని కష్టా లనుభవిస్తున్నప్పుడు, ఆదర్శప్రాయు రాలైన భార్యగా ప్రవర్తించిన శకుంతల, కాలపరివర్తనతో మనః పరివర్తనపొంది, సమీపస్థుల కసహ్య కారణమైంది.

నరిసింహం ఆశ్చర్యపడ్డాడు. అప్పటిదా, ఇప్పటిదా తన భార్య సహజ స్వరూపం ? అతని కంతుపట్టలేదు.

ఇది తప్పక డబ్బుతో వచ్చిన మార్పే! ఒకరికి నయం చేసే విషం మరొకర్ని చంపుతుంది ! ఒకరికి ప్రాణమిచ్చే డబ్బు మరొకరి జీవాలు లాగేస్తుందా?

డబ్బు నిజంగా విషతుల్యమా?

గాంధీ ఉపవాస దీక్షనుగురించి అన్న ముక్క జ్ఞాపకం వచ్చిం దతనికి. డబ్బుకూడా ఒకవిధమైన శక్తి. సమర్థుడి చేతులో అది ఎంత పనైనా చేస్తుంది, అసమర్థుడి మీద చేతకాని చేతబడి మాదరిగా బెడిసికొడుతుంది. దుష్ప్రయోగ ఫలితం !

అయినా తను డబ్బు సంపాదిస్తుంటే తన భార్య అడా వుడి పడవలసిన అగత్యంకూడా ఆట్టే లేదు, కాని -

నిజానికి, పాపం, శకుంతల తన కష్టాల్లో పాలుతీసు కున్న మనిషి ఒక్క రవ్వయినా సణగకుండా! తన సుఖం ఎందుకు పంచుకోరాదు?

శకుంతలను నిర్బంధించ వద్దను కున్నాడు నరిసింహం.

విజయలక్ష్మిని వశం చేసుకున్న వాళ్ళయొక్క కథ లనేకంగా వింటున్నాం. కాని వాళ్ళ ప్రకృతి వివరంగా ఎక్కడా చెప్పబడటంలేదు. ఆ కారణంచేత ఎవరో లక్షలు, కోట్లు సంపాదించా రనుకోవటమే కాని అవి మరొకళ్ళు సంపాదించాలంటే ఎలా వుండాలో స్పష్టంగా తెలుసుకో లేకుండా వున్నాం. నరిసింహం సంసారపక్షంగా విజయం పొందిన వాడికింద లెక్క. కాబట్టి అతని ప్రకృతినిగురించి తెలుసుకోవటం కొంతవరకు ఏ కొద్దిమందికయినా ఉపకా రంగా వుండకపోదు.

అనేక విషయాల్లో ఆతను నాజూకులేని మనిషి, ఈ వివిధ కళల్లో అతనికి చెప్పుకోతగ్గ అభిరుచి లేదు. అనేక మంది అతనికి డబ్బుసంపాదనే పని అనుకునేవాళ్లు. అతనికి దేన్నిగురించీ ఎవ్వరితోనూ అభిప్రాయ భేదం లేదు. అందరి తోనూ మాట్లాడేవాడు, ఎవరితోనూ వాదించేవాడు కాదు, పోట్లాడేవాడు కాదు, పూసుకు తిరిగేవాడు కాదు, అతిగా నైనా మాట్లాడేవాడు కాదు. యింకోళ్ళ కాలం అతను వ్యర్థం చెయ్యటానికీ, తన కాలం ఇతరులు వ్యర్థం చెయ్యా టానికీ కూడా తనకు విరామం లేదని స్పష్టంగా సూచించే

వాడు. అతని కింకో విచిత్రమయిన గుణం వుంది అతనికి యేపని చేస్తే డబ్బు లభిస్తే ఆ పనిలో అభిరుచి కలిగించుకునే వాడు. అతను ప్లీడరు వృత్తిలో ప్రవేశించేటప్పుడు కాఫీ హోటళ్ళ మాదిరిగా, చుట్టలు బీడీల మాదిరిగా అవసరమైన ప్లీడర్లు ఊళ్ళో నలుగురైదుగురి కన్న లేరని గమనించి జూనియర్లకు ఫైలు లేదని చూస్తూనే ఆ వృత్తిలో దిగాడు. ఆ వృత్తిని చూస్తే తనకు గౌరవం లేదని మాటవరసకైనా ఎవరితోనూ అన్న పాపాన పోలేదు.

అతనికి ఆలోచనను గురించి ఆలోచించే దురభ్యాసం లేదు. అటువంటి అలవాటు కవులకూ, కల్పనాకథలూ రాసే వాళ్ళకు కావాలి కాని డబ్బు సంపాదించే వాడి కక్కర్లేదు.

అతనిలో మెచ్చుకోవలసిం దేమిటంటే, బాలెన్స్ - తూకం, అతను గడిచిన పదిసంవత్సరాల్లోనూ తూకం తప్పి-తలవంచుకోవలసిన పనిచేసి ఎరగడు. ఎంత ఉద్రేకమూ మొహాన ఒక్క రవ్వయినా కనపడ నిచ్చేవాడు కాడు.

అతనిచేత డబ్బు ఖర్చుపెట్టించదలచిన వాళ్ళు అతన్ని యే విధంగానూ సమీపించలేక సంఘాని కంత అనవసరమైన మనిషి లేడన్నారు, అతనికి డబ్బిచ్చి పొయ్యేవాళ్లు 'ఆ మహారాజున్నాడు కాబట్టే బతికి పోతున్నాం' అన్నారు - అతన్ని సమీపించలేక పోయినప్పటికీ! పార్టీలచేత అంత మాట అనిపించుకున్న జూనియరుకు ముందు ముందు చాలా లాభం వుంది.

పాతికేళ్ళపైగా, నరిసింహాం తండ్రిగారి కాలంలో వచ్చారు. నరిసింహంగారి ఆవరణలో చిన్న గుడిసెవేసుకుని

ఒక శూద్ర కుటుంబం వుంది. రంగమ్మా, ఇద్దరు పిల్లలూ, రంగమ్మ పెద్దకొడుకు పొరుగూళ్ళో ఒక డాక్టరుగారి దగ్గర నెల కెనిమిదిరూపాయలు తెచ్చుకుంటున్నాడు. వాడప్పు డప్పుడూ వస్తుండేవాడు. నరిసింహం తండ్రిగారు ఒంగోలు తాలూకా కరువు సమయంలో పారిపోయి వచ్చిన ఈ కుటుంబాన్ని చేరదీసి వాళ్ళకు కాస్త స్థలమూ కొంపా యిచ్చి, రంగమ్మ మొగుడికి కొంత డబ్బిచ్చి బతుకుతూ వుండమన్నాడు. రంగమ్మ ఇంటివారికి అడ్డమైన చాకిరీ చేసి ఒక్క పైసా అయినా తీసుకోక రుణం తీర్చుకుంది చాలాయినట్టుగా! కాని కొత్త రుణానుబంధం ఏర్పడ్డది. నరసింహం తల్లి అతని నెలల్లో పోయింది. నరిసింహానికి రంగమ్మ తల్లయింది— పొయ్యటానికీ, పెట్టటానికీ తప్ప. పొయ్యటమూ, పెట్టటమూ మాత్రమే మాతృత్వం అనుకునే వాళ్ళకు నరసింహాన్ని పెంచినవాళ్లు పాఠం నేర్పారు. నరిసింహం దుర్దినాల్లో అంతా జారారు. మొగుడుపోయి, దేముడంటి యజమాని, నరిసింహం తండ్రి పోయి, అక్కడక్కడా పాచిపని చేసుకు బతుకుతున్న రంగమ్మ అప్పుడప్పుడూ నరిసింహానికి పావలాకూ అర్ధకూ సహాయపడ్డది!

శకుంతలకు అతిశయం ఎప్పుడొచ్చిందో ఎలా వచ్చిందో ఎవరూ గమనించలేరు. ఆవిడకు పనిమనుష్యులంటేనే అనుమానం. రంగమ్మ తనుచేత నియోగింపబడ్డ పనిమనిషి కాదని శకుంతల ఎరుగును గాని తన భర్తవల్ల ఏదోరూపంగా ప్రతినెలా అయిదారు రూపాయలు ముట్టజెప్పించుకుంటూన్న నాటినించి [టెక్నికల్‌గా] రంగమ్మ పనిమనిషి అయిపోయిం

దని శకుంతల తన్నుతాను నమ్మించుకుంది. తన కొడుకు, నెలలవాడు, రంగమ్మ చేతుల్లో వుంటే నల్లబడుతున్నట్టుగా వుండేవాడు, కల్మషం వాడిలో రంగమ్మ చేతులయొక్క స్పర్శవల్ల ప్రవేశిస్తున్నట్టుండేది శకుంతల మనస్సుకు. ప్రతి రోజూ రంగమ్మచేత ఎత్తుకోబడే వాడూ ఎన్నడూ రంగమ్మ స్పర్శ ఎరగనివాడూ ఒకటిగానే వుంటారా ? పదేళ్ళలో పెద్ద మార్పుండదా ? ఇటువంటి వాటిల్లో మడి కొంత తప్ప కుండా వుండే వుండాలి! కొంత కొంతమంది రాసే కథలలో జరిగినట్టు ఈ క్రుర వెధవ తన చేతులలోనించి దాని దగ్గిరికి అలా పరిగెత్తటమేమిటి ? మళ్ళీ దానిదగ్గిర్నించి తనదగ్గిరికి రమ్మంటే స్పష్టంగా ఉఁ హూఁ అని తల వూపటమేమిటి ? తన పిల్లవాణ్ని గురించి అన్నీ రంగమ్మకు కావాలా ? అన్నీ తను చెయ్యాలి తను చెందాలి—రంగమ్మ!ఇంకేం, రంగమ్మకి మనమడు లేని లోపమే తీరిపోయె ! మనమణ్ని ఇంతకన్న యెక్కువ చేసుకునేదేముంది ? 'అమ్మగారూ ! అబ్బాయి గారికి నీళ్ళు పొయ్యరేమండీ? నేను పొయ్యనా ?' 'అమ్మ గారూ ! అబ్బాయిగారికి బోజనం పెట్టలేదండీ కడుపేడు స్తుందీ !'

శకుంతల రంగమ్మతో మెల్లిగా ప్రారంభించి పోట్లాడ టం క్రమంగా హెచ్చించింది. తనకు రంగమ్మ మీద గల అసహ్యం మొగుడికి ఉందు దాద్దామనైనా ప్రయత్నంచెయ్య లేదు.

అనుకోకుండా వచ్చింది శకుంతల అహంకారాని కరత్యదశ.

ఒకరోజు పిల్లవాడి మెళ్ళో గొలుసు లేదు. అంతకు మునుపు రంగమ్మ ఆడిస్తున్నది పిల్లవాణ్ని. శకుంతల రంగమ్మను ముందూ వెనకా చూడకుండా అనుమానించింది. మాటకూడా రానంత కోపంతో రంగమ్మ గుడిసెదగ్గిరికి పోయి పిల్లవాడి గొలుసు, గొంగిలించినది, ఇచ్చేసెయ్యమంది యజమానురాలు రంగమ్మ తను గొలుసెరగనంది. కథలలో జరిగే గుడిసె సోదాలూ, నగలక్కడ కనిపించకపోవటం శకుంతలకు జ్ఞాపకం రాలేదు. ఆవిడ చర చరా లోపలికి పోయి సోదా ప్రారంభించింది. యెంతో సోదా అవసరం లేక పోయింది. బియ్యపు చాటలో సగం బియ్యం అడుగునా, సగం పైకి కనపడేటట్టూ గొలుసు మెరుస్తున్నది. దీని కేమంటా వన్నది శకుంతల. రంగమ్మ అవమానంతో తల వంచుకోలేదు. నాకేమీ తెలీదు పొమ్మన్నది. శకుంతల రంగమ్మను తక్షణం బయటికి నడవమన్నది. రంగమ్మ సరేనని తట్టా, బుట్టా బయట పడేస్తుండగా బజారు వెళ్ళిన నరిసింహం వచ్చాడు. సంగతంతా కనుక్కున్నాడు. అతనికి నవ్వాగ లేదు. శకుంతలకు ఒకవిధమైన భయం కలిగింది.

అత నెంత చెప్పినా పోతానని రంగమ్మ భీష్మించింది. నరిసింహం భార్యతో రంగమ్మను పోవద్దని బతిమాలమని లోపలికి వెళ్ళిపోయినాడు శకుంతల ఎలా అర్థంచేసుకుందో, వేరే బతిమాలటం లేకుండా క్షమాపణే యిచ్చింది రంగమ్మకు !